ప్రజాశక్తి
శనివారం 14 సెప్టెంబర్ 2024 5
అనంతపురం



కూలిన నాగేపల్లి వంతెన

ప్రజాశక్తి-కణేకల్లు

మండల పరిధిలోని నాగేపల్లి గ్రామ శివారులో హెచ్చెల్సీ కాలువపై ఉన్న వంతెన శుక్రవారం కూలిపోయింది. వంతెనపై లారీ వెళ్లిన వెంటనే ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే లారీ పూర్తిగా అవతల వైపు వెళ్లడంతో ప్రమాదం తప్పినట్లయింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. వంతెన కూలిపోవడంతో నాగేపల్లితో పాటు తుమ్మిగనూరు గరుడచేడు, బిదురుకుంతం, వన్నూరు నుంచి బళ్లారి వెళ్లే ప్రయాణికులకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అధికారులు, టిడిపి నాయకులు కూలిన వంతెనను పరిశీలించారు.



కూలిన నాగేపల్లి వంతెన

నేటి నుంచి సైన్సు పండుగ

అట్టహాసంగా జెవివి వార్షిక రాష్ట్ర మహాసభ
'అనంత' నగరంలో రెండు రోజులపాటు నిర్వహణ



రాష్ట్ర మహాసభ నిర్వహించే సభాస్థలి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేసే జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వార్షిక 17వ మహాసభ శనివారం నుంచి అనంతపురం నగరంలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 14, 15 తేదీల్లో నగరంలోని జిఆర్ ఫంక్షన్ హాలులో జరుగనున్నాయి. భాగ్యవతి హాల్‌లో జరిగే ఈ రెండు రోజుల మహాసభకు రాష్ట్ర నలుమూలల నుంచి జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు సుమారు 400 మంది హాజరుకానున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను జన విజ్ఞాన వేదిక మహాసభ నిర్వాహక కమిటీ పూర్తి చేసింది. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ ఈ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఈ రెండు రోజుల మహాసభలో ప్రజల్లోకి శాస్త్రీయ దృక్పథాన్ని తీసుకెళ్లడం ఎలాగన్న అంశాలపై చర్చించడంతోపాటు, జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలను సమీక్షంచుకోవడం, లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది.



మహాసభ ప్రాంగణ ముఖద్వారం

రెండు రోజులపాటు వివిధ అంశాలపై సదస్సులు

జన విజ్ఞాన వేదిక వార్షిక మహాసభ సందర్భంగా వివిధ అంశాలపై సదస్సులు జరుగనున్నాయి. మహాసభ ప్రారంభం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టరు డాక్టర్ వి.వినోద్‌కుమార్ హాజరు కానున్నారు. ఎస్కేయు వైస్ ఛాన్సలరు బి.అనిత విశిష్ట అతిథిగా హాజరవుతారు. సందర్భంగా 'సైంటిఫిక్ టెంపర్-ఛాలెంజెస్' అన్న అంశంపై ఆల్ ఇండియా పీపుల్స్ సైన్సు నెట్‌వర్కు మాజీ అధ్యక్షులు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ సైంటిస్టు సవ్యసాచి చటర్జీ పాల్గొని ప్రారంభోపన్యాసం చేయనున్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం. జెవివి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాచపాలెం చంద్రశేకర్‌రెడ్డి ఆత్మీయ సందేశం ఇవ్వనున్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నక్కా వెంకటేశ్వర్లు సౌహార్ద సందేశం ఇస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన భారత రాజ్యాంగం అమలు తీరు తెన్నులపై సదస్సు జరుగుతుంది. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం వక్తగా ఉంటారు. 15వ తేదీన 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి-కొన్ని పరిశీలనలు' అన్న అంశంపై జరిగే సదస్సుకు జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు వక్తగా ఉంటారు.

శాస్త్రీయత ఉట్టిపడేలా ఫ్లెక్సీలు ఏర్పాటు

ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక 17వ వార్షిక మహాసభలోనూ శాస్త్రీయత ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తోంది. వేదికపైన ఏర్పాటు చేసిన బ్యానర్లలోనే శాస్త్రీయ గుర్తులు కనిపించే విధంగా ఏర్పాటు చేయడం ఆలోచింపజేసే విధంగానున్నాయి. అదే విధంగా ఆవరణంలోనూ మహిళలపై హింస, అసమానతలు తదితర అంశాలపై ఫ్లెక్సీలు, ముఖ్య అతిథిగా ఏర్పాటు చేశారు.



అనంతపురం కలెక్టరేట్ ఎదుట సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



పుట్టపర్తి సిపిఎం కార్యాలయం వద్ద పార్టీ జెండాను అవనతం చేసిన నాయకులు

సీతారాం ఏచూరికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి అనంతపురం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సిపిఎం నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు శుక్రవారం ఘనంగా నివాళి అర్పించారు. అనంతపురంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాప సభలు నిర్వహించి నివాళి అర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ సీతారం ఏచూరి చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. అందే విధంగా జిల్లాకేంద్రంలో టివి టవర్ వద్ద సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో సీతారం ఏచూరి సంతాప సభలు జరిగాయి. ఇక శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో కూడా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభలను సిపిఎం, అనుబంధ సంఘాల నాయకులు, ఇతర పార్టీల నాయకులు నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మరిన్ని వార్తలు 6వ పేజీలో...



సీతారాం ఏచూరి చిత్రపటానికి గుంతకల్లు నాయకుల నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కదిరి నాయకులు



కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

బకాయి వేతనాలు చెల్లించే వరకూ సమ్మె

శ్రీ సత్యసాయి బోర్డు కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన
కార్మిక సంఘాలు, కార్మికులతో అధికారుల చర్చలు విఫలం

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు చెల్లించిన తర్వాతే విధుల్లోకి చేరుతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు అన్నారు. బకాయి వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించాలని శ్రీ సత్యసాయి శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు చేపట్టిన నిరవేదిక సమ్మె శుక్రవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాల నాయకులుచ కార్మికులతో సత్యసాయి బోర్డ్ కార్యాలయంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు శుక్రవారం చర్చలు నిర్వహించారు. అయితే వేతనాలు చెల్లింపు తప్ప ఏ ఇతర సూచన చేసినా సమ్మె విరమించేది లేదని కార్మికులు తెలిపారు. వేతనాలు చెల్లింపునకు సమయం పడుతుందని అధికారులు చెప్పడంతో చర్చలు విఫలం చెందాయంటూ కార్మికులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ 8 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నామమాత్రపు చర్చలతో కాలయాపన చేయడం అన్యాయంగా ఉందన్నారు. బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని, శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమును కాపాడాలని, ప్రజలకు, కార్మికులకు నష్టం కలిగించే క్యూ.సి, క్యూ.ఎ. కమిటి ప్రతిపాదనలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 5 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. జిల్లా సత్యసాయి బోర్డ్ ఆఫీసులో యూనియన్ నాయకులు ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ, డిఈ, జేఈలతో జరిపిన చర్చలు విఫలం అయ్యాయని అన్నారు. ప్రభుత్వం నిర్దిష్టమైన హామీ ఇవ్వకపోవడంతో సమ్మె యధావిధిగా కొనసాగించాలని నిర్ణయించుకున్నామన్నారు. గత సంవత్సరం చేసిన సమ్మె సందర్భంగా చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం హామీలు కూడా అమలు నేటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల మొండి వైఖరి కారణంగా సమ్మె యదావిధిగా కొనసాగుతుందని, ప్రజలు ప్రజాప్రతినిధులు మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి వాట్ వర్కర్స్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈశ్వరయ్య, శ్రీనివాసులు, తిప్పేస్వామి, మధు, శ్రీరాములు, ప్రసాద్, వన్నూరప్ప, లక్ష్మీ రెడ్డి, వీరాంజనేయులు. బాలకృష్ణ, బాబయ్య, రమేష్ రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



చర్చల సందర్భంగా అధికారులతో మాట్లాడుతున్న నాయకులు



జాతీయ తైక్వాండోలో 'మాంటిస్సోరి' విద్యార్థి ప్రతిభ

అనంతపురం : జాతీయ స్థాయిలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో నగరంలోని సంఘమేష్ నగర్‌లోని మాంటిస్సోరీ పాఠశాల విద్యార్థి కాంస్య పతకం సాధించారు. తెక్వాండో ఫెడరేషన్ అఫ్ ఇండియా వారు ఆగ్రాలో 35 కిలోల విభాగంలో పోటీలు నిర్వహించగా మాంటిస్సోరి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తారక్‌రెడ్డి అత్యంత ప్రతిభ కనబరచి కాంస్య పతకం సాధించాడు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ సి.సుర్యానారాయణరెడ్డి నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి మాధవి, ప్రిన్సిపల్ పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి

హోరాహోరీగా దులీప్ ట్రోఫీ

తొలిఇన్నింగ్‌లో కుప్పకూలిన ఇండియా - డి
ఇండియా -ఎ బౌలర్ల ధాటికి 183కే ఆలౌట్
ఇండియా -సి 525కి ఆలౌట్
దీటుగా ఆడుతున్న ఇండియా - బి



ప్రజాశక్తి - అనంతపురం,

ఇండియా ఏ బౌలర్ల ధాటికి ఇండియా డి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 183 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఇండియా ఏ జట్టుకు 107 తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇండియాఏ జట్టు బ్యాట్స్‌మెన్లు ప్రతమ్ సింగ్, మయాంక్ అగర్వాల్ అర్ధ సెంచరీలు చేశారు. మరో మ్యాచ్‌లో ఇండియా సి జట్టు భారీ స్కోర్ చేసింది. ఇండియా బి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ధీటుగా జవాబిచ్చింది. శుక్రవారం అనంతపురం ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో ఉన్న రెండు మైదానాల్లో రెండో రౌండ్ దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో భాగంగా ఇండియా ఎ, ఇండియా డి ఒక గ్రౌండ్‌లో , ఇండియా బి, ఇండియా సి జట్లు మరో గ్రౌండ్‌లో తలపడ్డాయి.

రాణించిన అఖీబ్, ఖలీల్

ఇండియా ఏ జట్టు బౌలర్లు ఖలీల్ అహ్మద్, అఖీబ్ ఖాన్ చెరో మూడు వికెట్లు తీసుకుని ఇండియా డి జట్టును స్వల్పస్కోర్‌కు పరిమితం చేశారు. మిగతా బౌలర్లు ప్రసిద్ధ్ కృష్ణ, తనుష్, సామ్స్ చెరో వికెట్ తీసుకున్నారు. ఇండియా డి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 52.1 ఓవర్లలో 183 పరుగులు చేసింది. జట్టులో దేవదత్ పడిక్కల్ 92(15 ఫోర్లు), హర్షిత్ రాణా 31, రికీ బుయి 23 పరుగులు చేయగా, మిగితా వారు పెద్దగా రాణించలేదు. దీంతో ఇండియా ఏ జట్టుకు 107 పరుగుల ఆధిక్యత లభించింది.

మయాంక్, ప్రతమ్ సింగ్ అర్ధసెంచరీలు

అనంతరం ఇండియా ఏ జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించి ఆటముగిసే సమయానికి వికెట్ నష్టానికి 115 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్లు ప్రతమ్ సింగ్ 82 బంతుల్లో 6 బౌండరీలతో 59, కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 87 బంతుల్లో 8 ఫోర్ల సహాయంతో 56 పరుగులు చేశారు.

ఇండియా- సీ భారీ స్కోర్

ఇండియా బీతో జరుగుతున్న మరో మ్యాచ్‌లో ఇండియా సీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగుల భారీ స్కోర్ చేసింది. జట్టులో ఆల్‌రౌండర్ మవన్ సుతార్ 156 బంతుల్లో 11 బౌండరీలు 3 సిక్సర్ల సహాయంతో 82 పరుగులు చేయడం విశేషం. అన్షుల్ కాంబోజ్ 38, మయాంక్ మార్కండే 17 పరుగులు చేశారు. ఇండియా బీ జట్టు బౌలర్లలో ముకేష్ కుమార్ 4, రాహుల్ చాహర్ 4, నవదీప్‌శైనీ, నితీష్‌కుమార్ రెడ్డి చెరో వికెట్ తీసుకున్నారు. ఇండియా బి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ధీటుగా జవాబిచ్చింది. జట్టులో కెప్టెన్ అభిమన్యు మిథున్ 91 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 51, నారాయణ్ జగదీశన్ 126 బంతుల్లో 8 ఫోర్లతో 67 పరుగులు చేశారు. ఇండియా బి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 124 పరుగులు చేసింది.



షెడ్యూల్ ప్రకారం జాబ్‌మేళా

కలెక్టర్ వినోద్ కుమార్



ఉపాధి కల్పనా కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో జాబ్ మేళా ను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేలా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కోర్టు రోడ్డులో గల జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని సిబ్బంది వివరాలను, వారు చేసే పనులను, వారుచేసే కార్యక్రమాలను పరిశీలించారు. అప్రెంటిషిప్ యాక్ట్ ఇంప్లిమెంటేషన్ జరగాలని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ అధికారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి సమన్వయంతో అప్రెంటిషిప్ యాక్ట్ ద్వారా ప్రైవేట్ కంపెనీల వారితో సంప్రదించి యువతకి అవకాశం కల్పించే విధంగా జాబ్ మేళాలు నిర్వహించాలని ఆదేశించారు. సంకల్ప పథకం కింద వచ్చే నిధులను సరైన పద్ధతిలో వినియోగించుకునేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. జాబ్ మేళాను షెడ్యూల్ ప్రకారం నిర్వహించే విధంగా చూడాలన్నారు. పదో తరగతి తర్వాత ఎలాంటి కోర్సులు చేయాలని పిపిటిని తయారు చేయాలని యంగ్ ప్రొసెసర్‌ను ఆదేశించారు. ప్రతి స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్,ఎస్టీ, ఎస్సీ, బిసి, హాస్టల్స్ నందు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఉపాధి శిక్షణ కార్యక్రమాలు, జాబ్ మేళాలు, విద్యార్థులలో కోర్సులపై అవగాహన కల్పించే విధంగా జిల్లా ఉపాధి కల్పన అధికారి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి,ఎన్ ఎ సి అసిస్టెంట్ డైరెక్టర్ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. యువతకు ఉపాధి మరియు ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉద్యోగ అవకాశం కల్పించే విధంగా చూడాలని, రాష్ట్రంలో అనంతపురం జిల్లాలో ఎక్కువ అవకాశాలు కల్పించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, ఎన్ఎసి అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి రాజ్ కుమార్, అనంతపురం రూరల్ తహశీల్దార్ హరిబాబు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి గుత్తి పట్టణ అధ్యక్షులుగా ఎంకె.చౌదరి

ప్రజాశక్తి-గుత్తి



టిడిపి పట్టణ అధ్యక్షుడిగా ఎంకె.చౌదరి ఎన్నికయ్యారు. పట్టణానికి చెందిన ఎంకె.చౌదరి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలందరికీ సుపరిచితుడు. ఎంకె.చౌదరి టిడిపి అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారుఈ ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు గుత్తి మండలంలో అత్యధిక మెజార్టీ రావడానికి కీలక పాత్ర పోషించారు. అలాగే టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఎంకె చౌదరిని టౌన్ కన్వీనర్‌గా ఎన్నుకునేందుకు మొగ్గు చూపారు. ఈనేపథ్యంలో బుధవారం టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పట్టణ అధ్యక్షుడిగా ఎంకె. చౌదరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్వయంగా ఎమ్మెల్యే ప్రకటించారు. దీంతో నూతన పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరిని ఎమ్మెల్యే ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ తోపాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.






తాడిపత్రి, పామిడి, రాయదుర్గం, పెద్దవడుగూరు మండలంలో సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కామ్రేడ్ సీతారాం ఏచూరి బాటలో నడుద్దాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు, శ్రామిక వర్గానికి తీరనిలోటని సిఐటియు రాష్ట్ర రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షక పోరాటాల మార్గదర్శి ఏచూరి సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీలేని యుద్ధం చేశారన్నారు. విద్యార్థి దశ నుంచే ఏన్నో పోరాటాలకు ఊపిరి పోసిన ఆయన మరణం కష్టజీవులకు నష్టమన్నారు. అనేక రకాల గడ్డు పరిస్థితులను అధిగమించి, అనేక త్యాగాలతో, జైలు జీవితానికి కూడా సిద్దపడి, పోరాట జెండాను ఎగుర వేసిన ఏచూరి మరణం నా లాంటి వారికి తీవ్ర బాధను, దిగ్భ్రాంతిని కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదవుల చుట్టూ పరిభ్రమిస్తూ, అధికారమే పరమావధిగా మెడలోని కండువాలను మార్చేసే నేటి రాజకీయాలు కాలంలో ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతూ, సమసమాజం కోసం పరితపిస్తూ నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ నిలబడ్డారని తెలిపారు. 12వ తరగతిలో సిబిఎస్ఇ సిలబస్ లో ఆలిండియా టాపర్ గా యూనివర్సిటీలో ఎ ప్లస్ విద్యార్థిగా గోల్డ్ మెడల్ సాధించారని, 8 బాషలలో మాట్లాడుతారని తెలుగు నేల నుండి ఉద్భవించి దేశ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఏచూరి నుండి ఎంతో నేర్చుకోవాలని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలు కోసం, సమసమాజం కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కాగా ఏచూరికి సంతాపంగా పైడిభీమవరం సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు జెండాను కిందికి దించి అవనతం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, శ్రీరాములు, మధు, తిప్పేస్వామి, కొండారెడ్డి, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలాగే సిపిఎం నగర న్యూ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురం మండల పరిధిలోని టీవీ టవర్ వద్ద ఉన్న కాలనీలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి ఆర్వి.నాయుడు, నగర కార్యవర్గ సభ్యులు ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, కొత్త కాలనీ నాయకులు నల్లప్ప, ప్రసాద్, శంకర్, హాజీబాబా, ఇజ్రాయేలు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా నివాళి

పామిడి : స్థానిక సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, కార్యదర్శి దస్తగిరి, అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, హుస్సేన్‌పీరా, ఆదినారాయణ, రంగనాయకులు, మస్తాన్, శేషారెడ్డి, గఫూర్, రాజు, రైతుసంఘం మండల కార్యదర్శి ముత్యాలు, ఉప్పర ఓళమ్మ, శిరీషా, బాబా ఫక్రుద్దీన్, మల్లికార్జున, నాగలక్ష్మి, నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : వజ్రకరూరు, కూడేరు మండల కేంద్రాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ నాయకులు ఎ.రంగారెడ్డి, కృష్ణమూర్తి, సిపిఎం వజ్రకరూరు మండల కార్యదర్శి విరూపాక్షి, సిఐటియు షేక్షావలి, చిన్న ఆంజనేయులు, నరసింహులు, రాకెట్ నాగన్న, జనవిజ్ఞాన వేదిక నాయకులు మల్లికార్జున స్వామి, హెల్త్ విభాగం సిహెచ్ఓ గురుప్రసాద్, హమాలీ నాయకులు పాల్గొన్నారు.

రాయదుర్గం : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన చూపిన ఉద్యమ బాటలో నడుద్దామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున పిలుపునిచ్చారు. శుక్రవారం రాయదుర్గం సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశ నుంచి చివరి శ్వాస వరకూ పేదలు, కష్టజీవుల పక్షాన నిలిచి పోరాటాలు చేశారన్నారు. ఆయన మరణం సిపిఎంతోపాటు దేశానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, కృష్ణానాయక్, హనుమంతు, రమేష్, ఉమేష్, అంజి, నాగ, ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు శివ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : సిపిఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, సిపిఐ నాయకులు రంగనాయకులు మాట్లాడుతూ ఏచూరి మరణం వామపక్షాలు, జాతీయ రాజకీయాలకు తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అనంతపురం సిపిఎం నగర కమిటీ నాయకులు

శింగనమల : మండల పరిధిలోని నిదనవాడ గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, శాఖా కార్యదర్శి దనాంజనేయులు, మోహన్‌రెడ్డి, మేకల పెద్దన్న, వరలక్ష్మి, ఆంజనేయులు, నాగేంద్ర, కుళ్ళాయిస్వామి, ఎర్రిస్వామి, సుంకన్న, సూర్యప్రకాష్, కొండారెడ్డి, ఓబిరెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాసులు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : సిఐటియు, రైతుసంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఏపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి ఎం.పోతులయ్య, మండల అధ్యక్షులు బి.చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు నాయకులు బ్రహ్మా సుబ్బరాయుడు, మధు, లక్ష్మన్న, ప్రతాప్, భాస్కర్, శివ, రైతులు వెంకట్ రాముడు, నారాయణ పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : మండలంలోని చిన్నపొలమడ గ్రామ సమీపంలో ఉన్న రైస్ గోడౌన్ కార్మికులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జగన్మోహన్‌రెడ్డి, బాల చౌడయ్య, నాగరాజు, శ్రీరాములు, రైస్ గోడౌన్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : స్థానిక సిపిఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్కే నాయుడు, మాజీ విద్యార్థి నాయకుడు ఓ.రామాంజనేయులు సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు చంద్ర, నరసయ్య, ఓబులేసు, షబ్బీర్, సురేంద్ర, వైటిసి రమేష్, వెంకీ, రామునాయక్, జగదీష్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి, శ్రీరామిరెడ్డి కార్మికుల నివాళి

బ్రహ్మసముద్రం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల కార్మికులు చేపట్టిన దీక్ష శిబిరంలో సీతారం ఏచూరికి నివాళులర్పించారు. ఇందులో భాగంగా మోకాళ్లపై నిలబడి అంజళి ఘటించారు. అనంతరం మౌనదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్, మండల అధ్యక్షుడు వన్నూరుస్వామి, మండల కార్యదర్శి చిత్తప్ప, నాయకులు రమేష్, రామదాస్, తిప్పేస్వామి, నాగప్ప, లింగమయ్య పాల్గొన్నారు.



బ్రహ్మసముద్రంలో మెకాళ్లపై కూర్చొని నివాళులర్పిస్తున్న సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల కార్మికులు



అనంతపురం నగరపాలక సంస్థలో నివాళులర్పిస్తున్న నాయకులు, కార్మికులు

విరాళాల సేకరణ

పామిడి : మండలంలోని కత్రిమల గ్రామంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకుల నిత్యావసర సరుకులతోపాటు విరాళాలు సేకరించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి కత్రిమలలో సేకరించిన 57 ప్యాకెట్ల బియ్యం, సొరకాయల పేట గ్రామంలో 16 ప్యాకెట్ల బియ్యం, రూ.10,560 నగదును విజయవాడకు పంపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల చందాలతో దారి మరమ్మతులు

బొమ్మనహాల్ : మండలంలోని కొలగానహళ్లి గ్రామంలో పొలాలకు వెళ్లే దారికి రైతులు స్వయంగా శ్రమదానం చేసుకుని బాగు చేసుకున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు దారి పూర్తిగా కోతకు గురైంది. ఈనేపథ్యంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో రైతులే ముందుకొచ్చి చందాలు వేసుకుని కోతకు గురైన చోట రెండు సిమెంట్ పైపులు వేసి జెసిబి సాయంతో గ్రావెల్ వేసి రోడ్డును బాగు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనంతరాజు, టిడిపి నాయకుడు సత్యనారాయణ, కావలి కృష్ణప్ప అనంతరాజు, వెంకటేశులు, రైతులు పాల్గొన్నారు.

నరసాపురంలో పశువైద్యశిబిరం

బెలుగుప్ప : మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో శుక్రవారం పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన నాలుగు పాడిపశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలో గొర్రెలకు నీలి నాలుక వ్యాధికి టీకాలు వేశామన్నారు. దాదాపు 250 జీవాలకు టీకాలు వేశామన్నారు.

ఉద్యోగ విరమణ హోంగార్డుకు ఆర్థికసాయం

అనంతపురం క్రైం : తాడిపత్రిలో హోంగార్డుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన డి.వెంకటసుబ్బమ్మకు ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం రూ.4,39,200 చెక్కును అందజేశారు. జిల్లా హోంగార్డుల ఒకరోజు వేతనంలో ఈ మొత్తాన్ని ఇచ్చారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి, ఆర్ ఐ మధులు ఉన్నారు.

పెద్దవడుగూరు తహశీల్దార్‌గా ఉషారాణి



పెద్దవడుగూరు : మండల తహశీల్దార్‌గా ఉషారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అంతేగాకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు బీటెక్ 3వ సంవత్సరం 2వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, 1వ సెమిస్టర్ సప్లిమెంటరీ, 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ సప్లిమెంటరీ, ఎంటెక్ 3వ సెమిస్టర్, సప్లిమెంటరీ, 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ, 1వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు, ఎం.ఫార్మసీ 3వ సెమిస్టర్ సప్లిమెంటరీ, ఎం.ఫార్మసీ 2వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ, 1వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి.శివకుమార్, అడిషినల్ కంట్రోలర్లు జి.శంకర్ శేఖర్‌రాజు, ఎం.అంకారావు, ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డిఎం

రాయదుర్గం : రాయదుర్గం ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో నలుగురు ఫోన్ చేసి సమస్యలు తెలియజేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరి విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు తెలిపారు.

హెచ్ఐవిపై అవగాహన

గుత్తి : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు శుక్రవారం హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా అదనపు అధికారిణి అనుపమ జేమ్స్, ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ ఎల్లప్ప, డాక్టర్ ఎల్లా రాముడు, ఐసిటిసి సూపర్‌వైజర్ వెంకటేశులు, టిబి సూపర్‌వైజర్ దేవదాస్, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జి.రమేష్, సందీప్ కుమార్, ఏఎన్ఎం ఎన్.కవిత, ఓఆర్ డబ్ల్యు లు డి.కృష్ణవేణి, జి.రాధాకుమారి, ఎస్.శంషాద్, లావణ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

శింగనమల : ఇటీవల ఉత్తమ అవార్డు అందుకున్న మండల పరిధిలోని సోదనపల్లి జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు వివేకానందను శుక్రవారం స్థానిక పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శివప్రసాద్, ప్రధానోపాధ్యాయులు సురేష్, మధుసూదన్‌రెడ్డి, పిఇటి బైపరెడ్డి, రాజేష్, పరిమళ, దేవి, రుక్మిణీదేవి, రజిని, విఆర్ఒ శ్రీనివాసరావు, సర్వేయర్ శివానంద, ఇంజినీర్ ప్రణవిత, మహిళా పోలీస్ నాగవేణి, శంకర్‌రెడ్డి, రమేష్, కిష్టా పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

సమస్యలు తెలుసుకోవడానికే గ్రామసభలు

తాడిపత్రి రూరల్ : ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని బోడాయిపల్లి, వెలమకూరు, ఆలూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా గ్రామసభల్లో తెలియజేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పోషణ పక్వాడకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రంగారావు, ఇఒఆర్‌డి జిలాన్‌బాషా, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఐజయ్య, ఎంఇఒ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు : విద్యుత్తు సబ్‌స్టేషన్ (33కెవి)లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రంగస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు.

డ్రెయినేజీలు శుభ్రం చేయకపోతే చర్యలు

అనంతపురం కలెక్టరేట్ : నగరంలో డ్రెయినేజీలను శుభ్రం చేయకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. నగరంలోని 21వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో కాలువలు నిండి, మురుగునీరు బయటకి రావడంపై శుక్రవారం స్థానికుల ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేవారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే నగరపాలక సంస్థ శానిటేషన్ సిబ్బందికి ఫోన్ ద్వారా మాట్లాడారు. వెంటనే సిబ్బందిని పంపి శుభ్రం చేయించాలని ఆదేశించడంతో అక్కడికి చేరుకుని కాలువలను శుభ్రం చేశారు. సీజనల్ వ్యాధులు ఉన్న నేపథ్యంలో పరిసరాలన్నీ శుభ్రంగా ఉండాలనిసూచించారు. డ్రెయినేజీలు రోడ్లపై పొంగిపొర్లడం వలన జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని చుక్కలూరు గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. తాడిపత్రి – గుత్తి ప్రధాన రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ప్రొద్దుటూరుకు చెందిన గంగయ్య(45) అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట జూదరులు అరెస్టు

శింగనమల : మండల పరిధిలోని నాయనపల్లి క్రాస్‌లో ఐదుగురు పేకాట జూదరులను అరెస్టు చేసినట్లు సిఐ కౌలుట్లయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.9,100 నగదు, 5 సెల్‌ఫోన్లు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నర్సులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-తాడిపత్రి

ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న నర్సులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని నర్సులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న నర్సులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్నా తమను రెగ్యులర్ చేయకపోవడంతో అనేక సమ్యలు ఎదుర్కోవడంతోపాటు చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



తాడిపత్రిలో నిరసన తెలుపుతున్న నర్సులు

రాయదుర్గం : ఆంధ్రప్రదేశ్ నర్సుల పోరాట కమిటీ పిలుపుమేరకు శుక్రవారం రాయదుర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద స్టాఫ్ నర్సులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 115 రద్దు చేయాలని, కాంట్రాక్టు స్టాఫ్ నర్స్ లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు రమేష్, సతీష్, ఉమాదేవి, రూప, మేరీ, గీత, దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రగతికి సోపానాలు

యల్లనూరు : గ్రామాల అభివృద్ధే ప్రగతికి సోపానాలు అని పంచాయతీ అధికారులు అన్నారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా పంచాయతీ అధికారులు స్థానిక జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పంచాయతీ కార్యదర్శి గీత, డిజిటల్ ఇంజనీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిని కలిసిన మండల వైసిపి నాయకులు



వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న పుట్లూరు మండల వైసిపి నాయకులు

పుట్లూరు : వైసిపి జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన అనంత వెంకటరామిరెడ్డిని మండల వైసిపి సీనియర్ నాయకుడు జేఆర్.పేట మాజీ సర్పంచి మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం అనంతపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం తమవంతు కృషి చేయడంతోపాటు మీ వెంట నడుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బెలుగుప్ప : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ జిఎస్ రామచంద్ర సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అలాగే ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న స్వచ్ఛతా హి కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ సిఐకి సన్మానం

పామిడి : పామిడి మండల సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేసి బదిలీపై వెళ్తున్న రాజశేఖర్‌రెడ్డిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. వైసిపి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎద్దులపల్లి రామకృష్ణారెడ్డి, బొల్లు వెంకటరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పామిడి సూరి, మైనార్టీ నాయకులు, ఎర్రగౌస్, తుల్లా, రజాక్, మధుకర్ బాషా, అన్వర్‌ఖాన్, కొత్తపల్లి శంకర్‌రెడ్డి, సర్పంచులు ఫోరం అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనుపల్లి నారాయణస్వామి, రామ్మోహన్‌రెడ్డి, నరసింహా, గజరాంపల్లి రమేష్, కృష్ణారెడ్డి, రామచంద్ర, ఎంఆర్‌పిఎస్ ఓబులేసు, ఎస్సీ సెల్ శివరాథోడ్, కౌన్సిలర్ రాజు, గొర్ల సుంకన్న, మండల సుధాకర్, బబ్లూ, రామాంజి, పుల్లా సురేంద్ర, నాగేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిళ్లను అధిగమించాలి

జెఎన్‌టియు ప్రిన్సిపల్ చెన్నారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ పని ఒత్తిళ్లను అధిగమిస్తే రోగాలు దరిచేరవని జెఎన్‌టియు ప్రిన్సిపల్ చెన్నారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవాసంఘం యూనిట్ ఆధ్వర్యంలో కిమ్స్ సవీరా హాస్పిటల్ సహకారంతో ఉచిత గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఆర్థోపెడిక్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయట ఆహారానికి ఎక్కువగా అలవాటు పడటం వల్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా మసాలా ఫుడ్స్, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం, ధూమపానం, మద్యపానం వంటికి గ్యాస్టిక్ సమస్యలకు దారి తీస్తున్నాయన్నారు. ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి నుంచి బయటపడితే ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. కిమ్స్ సవీరా ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు ఎన్.మహమ్మద్ షాహిద్ మాట్లాడుతూ ప్రస్తుతం మానవాళిలో 20 నుంచి 60 శాతం మంది గ్యాస్టిక్ సమస్యలతో భాధపడుతున్నారన్నారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారపు అలవాట్లు పాటించాలన్నారు. ముఖ్యంగా ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ సవీరా ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ వి.వరప్రసాద్‌రెడ్డి, సి.శశిధర్, జోజిరెడ్డి, నీరజ, కోఆర్డినేటర్ జి.మమత, జెఎన్‌టియు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి

వైద్యవిద్య ప్రయివేటీకరణ ప్రయత్నం సరికాదు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం వైద్య విద్యను ప్రయివేటీకరించేందు పూనుకోవడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ అన్నారు. వైద్య విద్య ప్రయివేటీకరణను నిరసిస్తూ శుక్రవారం నగరంలోని టవర్ క్లాక్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం విద్య వ్యాపారీకరణకు శ్రీకారం చుట్టడం బాధాకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 ఎంబిబిఎస్ కళాశాలలు ఉండగా 2024-25 విద్యా సంవత్సరం కోసం ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల, పాడేరు ప్రాంతాల్లో నూతన ఎంబిబిఎస్ కళాశాలలో పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేశారన్నారు. ఎన్ఎంసి ప్రతి కళాశాలలో 150 మంది విద్యార్థులు సీట్లు కేటాయించి ఈవిద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు అనుమతి కూడా జారీ చేసిందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పాడేరులో ఉన్న మెడికల్ కళాశాలలో కేవలం 50 సీట్లకు మాత్రమే అనుమతి స్వీకరించి మిగిలిన 700 ఎంబిబిఎస్ సీట్లను తాము నిర్వహించలేమని ఎన్ఎంసికు లేఖ రాయడం దౌర్భాగ్యమన్నారు. ఈ నిర్ణయాన్ని బట్టి చూస్తే ప్రయివేటు మెడికల్ కళాశాలకు వత్తాసు పలుకుతున్నట్టు స్పష్టంగా అర్థం అవుతోందన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా మరో 7 ఎంబిబిఎస్ మెడికల్ కళాశాలలో నిర్మాణంలో ఉండగా ప్రస్తుతం ఆ పనులను నిలిపివేశారన్నారు. ఫలితంగా వైద్య విద్యను అభ్యసించాలనుకున్న పేద విద్యార్థుల ఆశలు ఆవిరి అవుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 కళాశాలలను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తే ఒక కళాశాలకు 150 సీట్లు చొప్పున భర్తీ చేసినప్పటికీ ఆలిండియా కోట కింద 112 సీట్లు పోయినప్పటికీ మిగిలిన దాదాపు 1700 సీట్లలో రాష్ట్ర విద్యార్థులకు చదువుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విధానాలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నీట్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకుని ఆందోళనలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, నగర అధ్యక్షుడు భీమేష్, నగర నాయకులు సోము, శశికుమార్, వినోద్ కుమార్, చంద్ర, శివ, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డిసిసి అధ్యక్షుడికి సన్మానం

ఉరవకొండ : నూతనంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన రాకెట్ల వై.మధుసూదన్‌రెడ్డిని ఉరవకొండ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సోనియా శీనా, మైనార్టీ విభాగం నాయకులు అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్యశిబిరం

నార్పల : మండల కేంద్రంలోని ఆర్‌డిటి ఫీల్డ్ ఆఫీస్‌లో వికలాంగుల కోసం ప్రత్యేకంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన దాదాపు 52 మంది వికలాంగులకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో ఇద్దరిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి సిఫారసు చేసినట్లు వైద్యులు సదియా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అక్కులప్ప, ఆర్‌డిటి ఎస్‌టిఎల్ క్రిస్టయ్యా, జిఒ శ్రీనివాసులు, మహిళా నెట్‌వర్క్ కమిటీ సభ్యులు అరుణమ్మ, కుమారి, నాగేశ్వరి, లక్ష్మీదేవి, మండల సమైక్య ప్రెసిడెంట్ అమీర్, కార్యదర్శి ప్రసాద్, సహాయక కార్యదర్శి గంగానాయుడు పాల్గొన్నారు.

కార్యకర్తలకు సముచిత స్థానం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుత్తి

నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న టిడిపి కార్యాలయంలో మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తమ గెలుపుకు కృషి చేసిన కూటమి కార్యకర్తలందరికీ రుణపడి ఉంటారని చెప్పారు. టిడిపి కార్యకర్తలకు కమిటీల్లో తగిన గుర్తింపుని ఇస్తామని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్ట్యా యువకులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్దేశంతో పట్టణానికి చెందిన ఎంకె.చౌదరి ని టిడిపి టౌన్ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. త్వరలో కమిటీలోని మిగతా పదవులను భర్తీ చేస్తామన్నారు. అనంతరం వరద బాధితుల సహాయార్థం టిడిపి నాయకులు సేకరించిన నిత్యవసర వస్తువులను వాహనాల్లో విజయవాడకు ఎమ్మెల్యే తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి యు.రామలింగమయ్య, టిడిపి నాయకులు కరిడికొండ సూరి, చిన్నరెడ్డి యాదవ్, దిల్కాశీనా, శ్రీనివాసచౌదరి, ఎ.నరసింహులు, లక్ష్మణ్, ఎస్ఎం.బాషా, గోవర్ధన్ గౌడ్, బ్రాహ్మణపల్లి రంగస్వామి, చిన్న వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.